# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :109 | EDITOR:CHERUKU UPENDAR, | DATE : THURSDAY 24 AUGUST 2023 | PAGES:4, | RATE: Rs.5/-

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక : 109 | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | తేదీ : గురువారం 24 ఆగస్టు 2023 | పేజీలు : 4 | వెల : 5/-


## ప్రతిపక్షాలే లక్ష్యంగా కేసీఆర్ అడుగులు

ఖమ్మం- ప్రభాత సూర్యుడు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం పట్టణం జనరల్ అసెంబ్లీ స్థానం. ఇక్కడ భారతీయ జనతా పార్టీకి జిల్లా అధ్యక్షుడిగా కోనేరు చిన్ని అలియాస్ కోనేరు సత్యనారాయణ కొనసాగుతున్నారు ఒకేసారి 115 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించి సంచలనం సృష్టించిన

మిగతా 2లో...

## భారత్‌కు అమెరికా అధ్యక్షుడు



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

జీ20 దేశాల అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వర్తిస్తోంది. భారత్ నేతృత్వాన సెప్టెంబర్‌లో జీ20 దేశాధినేతల సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలోనే ఆమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భారత్‌తో 4 రోజుల పాటు పర్యటించనున్నారు. అమెరికా వైట్‌హౌస్ జాతీయ భద్రతా సలహాదారు జేక్ సల్లివన్ తెలిపారు. జీ20 దేశాల మధ్య జరిగే శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సెప్టెంబర్ 7 నుంచి 10వ తేదీల్లో భారత్‌లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయన భారత్‌తో ద్వైపాక్షిక సమావేశాలను కూడా జరుపుతారని సల్లివన్ తెలిపారు. అయితే దాని గురించి ఎలాంటి వివరాలను ఇంకా

మిగతా 2లో...

## ఈసీ ఐకాన్‌గా సచిన్



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

భారత ఎన్నికల సంఘం 'నేషనల్? ఐకాన్' మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్?, సచిన్? టెండూల్కర్‌కు మధ్య

మిగతా 2లో...

# ఇస్రో విక్రమార్క విజయం




- సాకారమైన పాతికేళ్ల చంద్రయాన్ కల
- చందమామ అందిన రోజు..
- విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్
- ల్యాండర్ నుంచి బయటికి వచ్చిన రోవర్
- 14 రోజులపాటు జాబిల్లిపై పరిశోధన
- జాబిల్లి ఫొటోలు పంపిన విక్రమ్
- గంటల్లోనే తొలి చిత్రం విడుదల
- అగ్ర రాజ్యాలను తోసి అద్భుత విజయం
- దక్షిణ ధ్రువాన్ని తాకిన తొలి దేశం
- చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన
- నాలుగో దేశంగా రికార్డు
- దేశవ్యాప్తంగా మిన్నంటిన సంబరాలు
- దక్షిణాఫ్రికా నుంచి ప్రధాని సందేశం
- ఇస్రోకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు


బెంగళూరు- ప్రభాత సూర్యుడు

చందమామ కథల్లో పట్టు వదలని విక్రమార్కుడిలాగా.. మన ల్యాండర్ విక్రమ్ కూడా పట్టుబట్టి చంద్రుడిపై దిగింది! ఇస్రో అనుకున్నది సాధించింది!! నాలుగేళ్ల క్రితం.. చంద్రయాన్-2 మిషన్‌లో భాగంగా రోదసిలోకి దూసుకుపోయి 3.84 లక్షల కిలోమీటర్ల దూరాన్ని అధిగమించి జాబిల్లిని ముద్దాడే ప్రయత్నంలో పొందిన ఓటమిని సవాలుగా తీసుకున్న మన ఇస్రో శాస్త్రజ్ఞులు.. చంద్రయాన్-3లో పంపించిన ల్యాండర్‌కు కూడా విక్రమ్ అని, రోవర్‌కు కూడా ప్రజ్ఞాన్ అని అప్పటి పేర్లే పెట్టి, పట్టుదలగా చందమామపైకి పంపారు. వారి విశ్వాసాన్ని నిజం చేస్తూ.. పొరపాటు అనే మాటకు తావే లేకుండా.. సాంకేతిక సమస్యల ఊసే లేకుండా.. చంద్రయాన్-2 మిగిల్చిన చేదు జ్ఞాపకాలను చెరిపివేస్తూ.. విమర్శకుల నోళ్లు మూయిస్తూ మన విక్రమ్ ల్యాండర్.. జాబిల్లి దక్షిణ ధ్రువంపై సగర్వంగా తొలి అడుగు వేసింది. అమెరికా, రష్యా, చైనా వంటి దేశాలకు సాధ్యం కాని పనిని సుసాధ్యం చేసింది. ఈ ఘనత సాధించిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. అలాగే జాబిల్లిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన నాలుగో దేశంగానూ నిలిచింది. గతంలో అమెరికా, రష్యా, చైనా మాత్రమే తమ వ్యోమనౌకలను సురక్షితంగా చంద్రుడిపై దించాయి. చంద్రయాన్-2కి కొనసాగింపుగా చంద్రుడిపై అధ్యయనం కోసం నింగిలోకి దూసుకెళ్లిన చంద్రయాన్-3.. అనుకున్న లక్ష్యాన్ని ఛేదించింది. విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌తో కూడిన ల్యాండర్ మాడ్యూల్ బుధవారం సాయంత్రం 6:04 గంటలకు సురక్షితంగా చందమామపై అడుగుపెట్టి.. ఇస్రోకు చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టింది. ఈ క్రమంలో అమెరికా, రష్యా, చైనా తర్వాత చంద్రునిపై దిగిన నాలుగో దేశంగా.. జాబిల్లి దక్షిణ

మిగతా 2 లో...







## భాగ్యనగరానికి దూరం కానున్న ఐటీ

హైదరాబాద్, ఆగస్టు 23, (న్యూస్ పల్స్)



పెరుగుట అనేది విరుగుట కోసమే అనే సామెత ఉంది. ప్రస్తుతం ఈ సామెత హైదరాబాద్ ఐటీ పరిశ్రమ విషయంలో నిజం కాబోతుందా? పెరిగిన భూముల ధరలు బహుళ జాతి సంస్థలను ఆలోచనలో పడేశాయా? ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న అభివృద్ధి నమూనా ఐటీ కంపెనీలకు ఇబ్బంది కలిగిస్తోందా? ఇలాంటి పరిస్థితి ముందు ముందు ఉంటే హైదరాబాద్ మహానగరంలో సామాన్యుల పరిస్థితి ఏమిటి? ఇవన్నీ విషయాలను ప్రభుత్వం ఆలోచించడం లేదు. పైగా తమ పాలనలోనే హైదరాబాద్ విపరీతంగా అభివృద్ధి చెందిందని చెప్పుకుంటున్నది. భూముల ధరలు వందల కోట్లకు పెరిగిన నేపథ్యంలో సొంత మీడియాలో డబ్బా ప్రచారం చేసుకుంటున్నది.దేశంలోని ఇతర ఐటీ కారిడార్లతో పోలిస్తే హైదరాబాద్‌లోనే ప్రస్తుతం భూముల ధరలు అధికంగా ఉన్నాయి. బెంగుళూర్ వైట్‌ఫీల్డ్స్, ఎలక్ట్రానిక్ సిటీ, సర్జాపూర్ రోడ్‌లలో ఎకరా రూ.30-40

మిగతా 3లో...

## కవిత కోసం కామారెడ్డి

నిజామాబాద్- ప్రభాత సూర్యుడు



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి నుంచి ఎన్నికల బరిలోకి దిగితే.. ఆ చుట్టు పక్కల ఉన్న జిల్లాలు.. నిజామాబాద్‌తోపాటు కరీంనగర్, ఆదిలాబాద్‌లపై కూడా ఆయన గెలుపు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని కేసీఆర్ భావిస్తున్నారు. అలాగే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి మళ్లీ కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత.. పోటీకి దిగితే.. ఆమె గెలుపు నల్లేరు మీద నడకే అవుతోందనే ఓ చర్చ సైతం సదరు పొలిటికల్ సర్కిల్‌లో నడుస్తోంది. ఎందుకంటే.. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగిన ధర్మపూరి అర్వింద్ చేతిలో కల్వకుంట్ల కవిత ఓటమి పాలయ్యారు. ఈ సారి ధర్మపూరి అర్వింది.. ఎంపీగా లేదా ఏదో ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని చూస్తున్నారు. అలాంటి వేళ.. ఈ జిల్లాలో కేసీఆర్ పోటీ చేస్తే... అతడి విజయాన్నే కాదు.. బీజేపీ ప్రభావాన్ని సాధ్యమైనంత వరకు అడ్డుకోవచ్చుననే ఓ చర్చ సైతం పొలిటికల్ సర్కిల్‌లో నడుస్తోంది. అదీకాక.. దక్షిణ తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా వేళ్లూనుకొంటొంది. ఇటువంటి పరిస్థితుల్లో ఆయా జిల్లాల నుంచి బరిలో దిగే కంటే.. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో కారు పార్టీని షికార్ చేయిస్తే.. అది

మిగతా 2లో...

## విశాఖ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా జేడీ లక్ష్మినారాయణ



విశాఖపట్టణం- ప్రభాత సూర్యుడు

సీబీఐ మాజీ జేడీ లక్ష్మినారాయణ విశాఖపట్నం లోక్ సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. నందిగామలో ఓ ప్రైవేటు స్కూల్ కార్యక్రమంలో పాల్గన్న ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో పార్టీలు, కులాల కంటే పోటీ చేసే అభ్యర్థులను చూసే ప్రతిఒక్కరు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు వినియోగించుకోకపోతే వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరుతానన్నారు. గత

మిగతా 4లో...

## భారత్‌కు అమెరికా అధ్యక్షుడు

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించలేదు. అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ భారత్‌కి రావడం ఇదే తొలి సారి కావడం విశేషం. మరో వైపు 2026లో జీ20 సమ్మిట్‌కు అమెరికా ఆతిథ్యం ఇవ్వనుంది.ఇక సెప్టెంబరులో ఇండోనేషియాలో జరిగే ఆసియన్ సదస్సుకు అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ విడిగా హాజరవుతారని కూడా సల్లివన్ తెలిపారు. జీ20 సమ్మిట్‌లో బైడెన్ బ్యాంకుల ఆధునీకరణ డెవలప్‌మెంట్‌పై ప్రధానంగా చర్చిస్తారని సల్లివన్ వెల్లడించారుఇదిలా ఉండగా, జీ20 సమ్మిట్ నేపథ్యంలో సెప్టెంబర్ 8–10 తేదీలను ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించే ప్రతిపాదనకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం ఆమోదం తెలిపినట్లు అధికారులు తెలిపారు. సీఎం ఆమోదించిన ప్రతిపాదన ప్రకారం, న్యూఢిల్లీ పోలీసులు జిల్లా పరిధిలోని బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలతో సహా అన్ని రకాల వాణిజ్య, వ్యాపార సంస్థలు సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు మూసివేయబడతాయి.

## ఈసీ ఐకాన్‌గా సచిన్

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం అవగాహన ఒప్పందం జరుగనుంది. ఎన్నికల పక్రియలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా అవగాహన కల్పించేందుకు ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా సచిన్ ఓటర్లు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించనున్నారు. ప్రస్తుతం దేశంలో 94.50 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. సుమారు దేశంలో 140 కోట్లకు పైగా జనాభా ఉండగా జనవరి 1 నాటికి 94,50,25,694 మంది ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఈసీ తెలిపింది. 1951లో మొదటిసారి జరిగిన సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం ఓటర్ల శాతం ఆరు రెట్లు పెరిగింది. మొత్తం ఓటర్లలో సుమారు 31.50 కోట్ల మంది ఓటర్లు గత 2019 లోక్‌సభ ఎన్నికల ఓటింగ్?కు దూరంగా ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది ఓటర్లు పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు, యువతతో పాటు వలస వెళ్లిన వారు ఉన్నారు. ప్రజాస్వామ్య దేశంలో యువత ఓటింగ్‌కు దూరంగా ఉండడంపై ఈసీ ఆందోళన వ్యక్తం చేసింది. వారిలో చైతన్యం నింపేందుకు, ఓటు ప్రాముఖ్యతను వివరించేందుకు ఈసీ నేషనల్ ఐకాన్ పేరుతో ప్రముఖులతో అవగాహన కుదుర్చుకుంటోంది. పెద్ద ఎత్తున ప్రచారం చేపడుతోంది. అవగాహన ఒప్పందంలో భాగంగా సచిన్ మూడేళ్ల పాటు ఓటర్లకు అవగాహన కల్పించనున్నారు. ఎన్నికల్లో ఓటింగ్? శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం, సచిన్? సంయుక్తంగా కృషి చేస్తారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ తక్కువగా నమోదవుతోంది. పట్టణ ప్రజలు, యువత ఓటింగ్?పై ఆసక్తి చూపడం లేదు. వారిలో అవగాహన కల్పించేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. సచిన్‌కు మంచి? పేరు ప్రఖ్యాతులు ఉండడంతో ఆయన చెబితే ప్రభావం ఉంటుందని ఈసీ నమ్ముతోంది. ముఖ్యంగా పట్టణ యువతను సచిన్ ప్రభావితం చేయగలరని ఈసీ ఈసీ విశ్వాసంతో ఉంది. ఈ నేపథ్యంలో ఆయనతో ఒప్పందం కుదుర్చుకుంది. రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల పక్రియలో యువత? ఎక్కువగా పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. సచిన్‌కు ఉన్న ఫాలోయింగ్ ఓటింగ్ శాతాన్ని పెంచడానికి దోహద పడుతుందని భావిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం సచిన్‌తో అవగాహన ఒప్పందం చేసుకోనుంది.ఎన్నికల్లో ఓటింగ్? శాతం పెంచేందుకు ఎన్నికల కమిషన్ ప్రసిద్ధి చెందిన వ్యక్తులను 'నేషనల్? ఐకాన్'గా? నియమిస్తుంది. వీరి ద్వారా ప్రజలు ఓటింగ్? పక్రియలో పాల్గొనేలా అవగాహన కల్పిస్తుంది. 2019 లోక్?సభ ఎన్నికల సందర్భంగా ఎమ్?ఎస్? ధోని, అమీర్? ఖాన్?, మేరీ కోమ్? 'నేషనల్? ఐకాన్?'గా వ్యవహరించారు. 2022లో పంకజ్ త్రిపాఠీని నేషనల్? ఐకాన్‌గా నియమితులయ్యారు. సచిన్ టెండూల్కర్ తన కెరీర్‌లో 200 టెస్ట్ మ్యాచ్‌లలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఇది ప్రపంచంలో సాటిలేని రికార్డు. మొత్తం 664 మ్యాచ్‌ల్లో 48.52 సగటుతో, 67 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో 100 సెంచరీలు చేశారు. 164 అర్ధ శతకాలు బాదారు. మొత్తం 34,357 పరుగులు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా సచిన్ రికార్డులకెక్కారు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలు సాధించిన ఏకైక ఆటగాడిగా క్రికెట్ చరిత్రలో చెదరని చరిత్రను లిఖించారు. అంతేకాకుండా.. ఆరు ప్రపంచ కప్‌లలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాడు. అతను 2011 ప్రపంచ కప్ గెలవడంలో కీలక బాధ్యత వహించాడు.

## బాలింత మృతి.. ఆసుపత్రిపై బంధువుల దాడి

నాగర్ కర్నూలు- ప్రభాత సూర్యుడు

నాగర్ కర్నూల్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ కోసం వచ్చిన అచ్చంపేట మండలం దర్శన్ గడ్డ తండా కు చెందిన రోజా అనే మహిళ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఈ నెల 15 వ తేదిన డాక్టర్ కృష్ణ సిజేరియన్ ఆపరేషన్ చేశారు. బాబు జన్మించారు. కుట్లు వేసే సమయంలో కడుపులో కాటన్ పెట్టి కుట్లు వేయడంతో మంగళవారం ఆమెకు తీవ్ర రక్తస్రావం కావడంతో తిరిగి ఆసుపత్రికి తీసుకువచ్చారు. చికిత్స చేస్తున్న రక్త స్రావం ఎంతకు ఆగ కపోవడంతో ఆమె పరిస్థితి విషమించింది. మెరుగైన చికిత్స కోసం హైదరాబాదుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆగ్రహం చెందిన రోజా కుటుంబ సభ్యులు, బంధువులు అచ్చంపేట పట్టణంలో డాక్టర్ కృష్ణ నిర్వహిస్తున్న ప్రైవేటు ఆసుపత్రి పై దాడి చేసి అద్దాలను ఫర్నిచర్ ను ధ్వంసం చేశారు. మహిళా మృతికి కారణమైన డాక్టర్ పై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అంబెద్కర్ కూడలిలో ఆందోళన చేపట్టారు. వారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు.

# ఇస్రో విక్రమార్క విజయం

(మొదటిపేజీ తరువాయి)

ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ ఘనత సాధించింది. చంద్రయాన్–3 కంటే ముందే చంద్రుని దక్షిణ ధ్రువంపై దిగాలని ఉవ్విళ్లూరిన లూనా–25.. జాబిల్లిపై కుప్పకూలిన నాలుగు రోజుల వ్యవధిలోనే ఇస్రో ఈ అద్భుత ఘనత సాధించడం విశేషం.

బుధవారం సాయంత్రం 5:20 నిమిషాలకు ప్రారంభమైన ల్యాండింగ్ ప్రక్రియ ప్రతిక్షణం ఉత్కంఠగా సాగింది. బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ సెంటర్ నుంచి ఇస్రో ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఇది 'చంద్రయాన్'లో అత్యంత సంక్లిష్టమైన, కష్టమైన ప్రక్రియ. 5.20 గంటల సమయానికి ల్యాండర్ చంద్రుడి ఉపరితలం నుంచి దాదాపు 125 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. అట్నుంచి శరవేగంగా కిందికి కదులుతూ వెళ్లింది. అక్కడి నుంచి ల్యాండర్‌లోని వ్యవస్థలే సొంతంగా నిర్ణయాలు తీసుకుంటాయి. దీనికి అనుగుణంగా అంతకు ముందే 'ఆటోమేటిక్ ల్యాండింగ్ సీక్వెన్స్' పనిచేయడం మొదలుపెట్టింది. ఈ దశలో శాస్త్రవేత్తల నియంత్రణ ఏదీ ఉండదు. 7.4 కిలోమీటర్ల ఎత్తు దాకా 'రఫ్ బ్రేకింగ్' దశ కొనసాగింది. ఈ ప్రక్రియ 11.5 నిమిషాలపాటు జరిగింది. చంద్రుడిని సమీపించే కొద్దీ, ల్యాండర్ వేగం తగ్గిస్తూ రావాలి. ఇందులో భాగంగా... రెండు ఇంజన్లు ఆగిపోయాయి. మరో రెండు ఇంజన్లు మాత్రమే పని చేశాయి. ల్యాండర్ వేగం సెకనుకు 1687 మీటర్ల నుంచి 358 మీటర్లకు తగ్గింది. 7.4 కిలోమీటర్ల నుంచి 'ఆల్టిట్యూడ్ హెూల్డ్ ఫేజ్' మొదలైంది. చంద్రయాన్–2 ఈ దశలోనే విఫలమైంది. చంద్రయాన్–3 దీనిని విజయ వంతంగా అధిగమించింది. సరిగ్గా 6.04 గంటలకు చంద్రుడి ఉపరితలంపైకి దిగింది. అంతే... కంట్రోల్ సెంటర్‌లో హర్షాతిరేకాలు మిన్నంటాయి. దక్షిణాఫ్రికా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రధాని మోదీ.. భారత త్రివర్ణ పతాకాన్ని చూపిస్తూ.. దీన్ని సరిహద్దులు దాటి విస్తరించిన ఘన విజయంగా అభివర్ణించారు. ఇది ఒక్క భారత్ విజయమే కాదని, యావత్ మానవాళి విజయమని అన్నారు.

**ఫలించిన ప్రార్థనలు..**

జూలై 14న చంద్రయాన్–3 ప్రయాణం మొదలైనప్పటి నుంచి ఇది అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ మిషన్ విజయవంతం కావాలని రాజకీయ నాయకులు ఆకాంక్షించారు. వేలాది మంది ప్రజలు ప్రార్థనలు చేశారు. ల్యాడింగ్ రోజైన బుధవారం దేశవ్యాప్తంగా దీనికోసం ఆసక్తిగా ఎదురుచూశారు. దీంతో ఇస్రో ల్యాండింగ్ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేసింది. 1960, 1970 దశకాల్లో ప్రయోగించిన అపోలో మిషన్ కంటే చంద్రయాన్–3 జాబిల్లిని చేరుకోవడానికి ఎక్కువ సమయం పట్టింది. అప్పట్లో అమెరికా ఉపయోగించిన రాకెట్ల కంటే భారత్ చాలా తక్కువ శక్తిమంతమైన రాకెట్లను ఉపయోగించింది.

దీంతో వ్యోమనౌక చంద్రుని దిశగా వెళ్లడానికి భూమి చుట్టూ అనేక సార్లు పరిభ్రమించాల్సి వచ్చింది. ఆ తర్వాత భూమి కక్ష్య నుంచి చంద్ర కక్ష్యలోకి ప్రవేశించింది. బుధవారం సురక్షితంగా చంద్రునిపై దిగింది. ఆ తర్వాత కొన్ని నిమిషాలకే బెంగళూరులోని కంట్రోల్ సెంటర్‌తో టచ్‌లోకి వచ్చింది. చంద్రుడిపై కాలు పెట్టిన ప్రదేశం తొలి చిత్రాలను పంపింది.

**భయానక 20 నిమిషాల్లో..**

బుధవారం సాయంత్రం 5.47 గంటల సమయంలో మొదలైన విక్రమ్ ల్యాండింగ్ ప్రక్రియ నిర్ణీత షెడ్యూలు ప్రకారం.. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సజావుగా సాగిపోయింది. అప్పటిదాకా మిషన్ కంట్రోల్ సాయంతో సాగిన విక్రమ్.. పవర్ డిసెంట్ ఫేజ్ మొదలు కాగానే 'ఆటోమేటెడ్ ల్యాండింగ్ సీక్వెన్స్' మోడ్‌లోకి వచ్చింది. అంటే.. ఆ క్షణం నుంచి ఏ నిర్ణయమైనా అది సొంతంగా తీసుకోవాల్సిందే. మిషన్ కంట్రోల్ నుంచి ఏ సాయమూ అందదు. పవర్ డిసెంట్‌లో ప్రధానంగా నాలుగు ఫేజ్‌లు ఉంటాయి.

అందులో తొలి దశ అయిన రఫ్ బ్రేకింగ్ ఫేజ్‌లో.. విక్రమ్ ల్యాండర్ హారిజాంటల్ వేగం గంటకు 6000 కిలోమీటర్ల నుంచి దాదాపు సున్నాకు తగ్గిపోయింది. 10 సెకన్లపాటు సాగే రెండో దశ.. ఆల్టిట్యూడ్ హెూల్డ్ ఫేజ్‌లో ల్యాండర్ చంద్రుడి ఉపరితలానికి 7.42 కిలోమీటర్ల ఎత్తున నిలిచి సమాంతర స్థితి నుంచి నిలువుగా ఉండే స్థితిలోకి రావడానికి 50 డిగ్రీల మేర వంగింది. 175 సెకన్లపాటు సాగే మూడో దశ ఫైన్ బ్రేకింగ్ ఫేజ్‌లో.. ల్యాండర్ దాదాపుగా 28 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. ఆ సమయంలో అది చంద్రుడి ఉపరితలానికి 800 నుంచి 1000 మీటర్ల ఎత్తుకు చేరుకుంది. నాలుగోది టెర్మినల్ డిసెంట్ ఫేజ్.. ఈ దశలో ఫ్రీఫాల్ అయిన ల్యాండర్ విక్రమ్ కాళ్లు చంద్రుడిపై నెమ్మదిగా దిగాయి.

ప్రయాణం సాగిందిలా..

**ఆగస్టు 23:** 41 రోజుల సుదీర్ఘ ప్రయాణం అనంతరం సాయంత్రం 6.04గంటలకు ప్రజ్ఞాన్ రోవర్‌తో కూడిన విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై సురక్షితంగా ల్యాండ్ అయి చరిత్ర సృష్టించింది.

**ఆగస్టు 21:** చంద్రయాన్–2 ఆర్బిటర్‌ను చంద్రయాన్–3 ల్యాండర్ మాడ్యూల్‌లో అనుసంధానించే ప్రక్రియ పూర్తయింది.

**ఆగస్టు 19:** ల్యాండర్‌లో ఉండే ఇంధనాన్ని మండించి తొలిదశ కక్ష్య తగ్గింపు ప్రక్రియను నిర్వహించారు. దీంతో ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడికి 113 కిలోమీటర్లు – 157 కిలోమీటర్ల కక్ష్యలోకి ప్రవేశించింది.

**ఆగస్టు 17:** ప్రొపల్షన్ మాడ్యూల్ సాయంతో జాబిల్లి కక్ష్యలో తిరుగుతున్న ల్యాండర్ మాడ్యూల్ దాని నుంచి విజయవంతంగా విడిపోయింది.

ఆగస్టు 16: చివరిసారిగా కక్ష్య తగ్గింపు ప్రక్రియను చేపట్టి చంద్రయాన్–3ని జాబిల్లికి 153 కిలోమీటర్లు – 163 కిలోమీటర్ల కక్ష్యలోకి చేరవేశారు.

**ఆగస్టు 06:** రెండో దశ చంద్రుడి కక్ష్య తగ్గింపు ప్రక్రియను నిర్వహించారు. ఈ సమయంలో వ్యోమనౌక తీసిన జాబిల్లి వీడియోను ఇస్రో విడుదల చేసింది.

**ఆగస్టు 05:** వ్యోమనౌకను జాబిల్లి కక్ష్యలోకి ప్రవేశపెట్టే ప్రక్రియను ఇస్రో విజయవంతంగా పూర్తిచేసింది. '

**ఆగస్టు 01:** చంద్రయాన్–3 భూమి చుట్టూ తిరిగే కక్ష్యను విజయవంతంగా పూర్తిచేసుకుని చంద్రుని కక్ష్య దిశగా ప్రయాణం మొదలుపెట్టింది.

**జూలై 17:** భూ కక్ష్యలో తిరుగుతున్న చంద్రయాన్–3 రెండో దశ కక్ష్య పెంపు విజయవంతమైంది. మొత్తం నాలుగు దశల్లో చంద్రయాన్–3 కక్ష్యను పెంచారు.

**జూలై 15:** బెంగళూరులోని ఇస్ట్రాక్ ఉపగ్రహ నియంత్రణ కేంద్రం నుంచి భూ కక్ష్యలో ఉన్న చంద్రయాన్–3 ప్రొపల్షన్ మాడ్యూల్‌లో ఉన్న ఇంధనాన్ని మండించి తొలిదశ కక్ష్యను పెంచారు. భూమికి దగ్గరగా 173 కిలోమీటర్ల దూరంలోని కక్ష్యలో ప్రవేశపెట్టారు.

**జూలై 14:** శ్రీహరికోట నుంచి చంద్రయాన్–3ని ఎల్‌వీఎం3 ఎం4 వాహక నౌక విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడంతో చంద్రుడి దిశగా చంద్రయాన్–3 ప్రయాణం ప్రారంభమైంది.

జాబిల్లిపై సురక్షితంగా ల్యాండ్ అయిన చంద్రయాన్–3కి సంబంధించి.. ఈ ఘనత సాధించిన భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో కమ్మని కబురు దేశ ప్రజలకు అందించింది. చంద్రయాన్–3 విక్రమ్ ల్యాండర్‌కు, బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంతో కమ్యూనికేషన్ లింక్ ఏర్పడినట్లు ట్విటర్ వేదికగా ఇస్రో వెల్లడించింది. అంతేకాదు.. ల్యాండర్ చంద్రుడిపై దిగాక తీసిన ఫొటోలను కూడా ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ఈ ఫొటోలతో పాటు ల్యాండర్ విక్రమ్ జాబిల్లిపై దిగుతున్న సమయంలో తీసిన ఫొటోను కూడా ఇస్రో షేర్ చేసింది. ల్యాండర్ నీడ చంద్రుడి ఉపరితలంపై స్పష్టంగా కనిపించింది. రాళ్లు, గుంతలు లేని చదునైన ప్రదేశంలో చంద్రయాన్–3 ల్యాండ్ అయినట్లు ఆ ఫొటోను చూస్తే స్పష్టమైంది.

షార్ నుంచీ గత నెల 14వ తేదీన చంద్రయాన్–3 ద్వారా ప్రయోగించిన ప్రొపల్షన్ మాడ్యూల్, విక్రమ్ ల్యాండర్, రోవర్ 40 రోజుల్లో చంద్రుని చేరుకున్నాయి. భూమి నుంచీ చంద్రుడున్న 3,84,400 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 40 రోజుల్లో ప్రొపల్షన్ మాడ్యూల్ అధిగమించింది. ఈనెల 5వ తేదీన చంద్రుని కక్ష్యను చేరుకున్న మాడ్యూల్ అక్కడ ఐదు రోజుల పాటు పరిభ్రమించింది. ఆపై క్రమంగా చంద్రునికి చేరువ వుతూ వస్తోంది. తొలుత చంద్రుడి ఉపరితలానికి వంద కిలోమీటర్లు చేరువైన మాడ్యూల్ ఆపై 30 కిలోమీటర్ల సమీపానికి చేరుకుంది. అక్కడ మాడ్యూల్ నుంచీ విక్రమ్ ల్యాండర్, అందులోని రోవర్ విడిపోయాయి. షార్ నుంచీ కేవలం చంద్రయాన్–3 రాకెట్‌ను ప్రయోగించారు తప్పితే ఇతర సాంకేతిక ప్రక్రియ యావత్తూ బెంగళూరులో ఇస్రోకు చెందిన ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచీ శాస్త్రవేత్తలు మాడ్యూల్‌ను, తర్వాత విక్రమ్ ల్యాండర్‌ను, ఆపై చివరగా రోవర్‌ను ట్రాక్ చేయడంతో పాటు నియంత్రించనున్నారు.

చందమామ రహస్యాలు తెలుసుకునేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) దశాబ్దాలుగా ప్రయత్నిస్తోంది. 2008 అక్టోబరు 22న పీఎస్ఎల్వీ–సీ 11 రాకెట్ ద్వారా చంద్రయాన్–1ని ఇస్రో ప్రయోగించింది. 2008 నవంబరు 8న అది చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించి పరిశోధనలు సాగించింది. దీనిలో భాగంగా ప్రయోగించిన 35 కిలోల మూన్ ఇంపాక్ట్ చందమామ ఉపరితలంపై నీటి జాడను తొలిసారిగా గుర్తించింది.

## ప్రతిపక్షాలే లక్ష్యంగా కేసీఆర్ అడుగులు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి కేసీఆర్.. అదే దూకుడును కొనసాగిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. నిన్న సాయంత్రం దాకా అభ్యర్థుల పేర్లు ప్రకటించి హడావిడి సృష్టించిన ఆయన.. సాయంత్రం ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టే కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగానే భారతీయ జనతా పార్టీ కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిని తన వద్దకు పిలిపించుకున్నారు. తనదైన ఓటు రాజకీయాలకు తెరదీశారు. అంతేకాదు ఎన్నికలకు ముందు కొత్తగూడెం కమలం పార్టీలో కల్లోలం సృష్టించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం పట్టణం జనరల్ అసెంబ్లీ స్థానం. ఇక్కడ భారతీయ జనతా పార్టీకి జిల్లా అధ్యక్షుడిగా కోనేరు చిన్ని అలియాస్ కోనేరు సత్యనారాయణ కొనసాగుతున్నారు. కోనేరు చిన్ని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వియ్యంకుడు గరికపాటి వెంకటరావుకు దగ్గర బంధువు. తెలుగుదేశం పార్టీ నుంచి భారతీయ జనతా పార్టీలోకి వచ్చేముందే కొత్తగూడెం స్థానంపై చిన్ని కన్నవేశారు. భారతీయ జనతా పార్టీ అధిష్టానం కూడా దీనికి ఒకే చెప్పింది. అయితే భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలతో పొసగని కోనేరు చిన్ని అంటి ముట్టనట్టే ఉంటున్నారు. పైగా పార్టీ కార్యవర్గాన్ని కలుపుకోకుండానే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ ఆయన వ్యవహార శైలి మీద భారతీయ జనతా పార్టీ పెద్దగా యాక్షన్ ఏమీ తీసుకోలేదు. అయితే తాజాగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గానికి వనమా వెంకటేశ్వరరావు పేరును వెల్లడించారు. వనమా వెంకటేశ్వరరావు బీసీ సామాజిక వర్గానికి చెందడంతో.. బిజెపి కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే టికెట్ ఇస్తుందని పార్టీలోని కీలకవర్గాలు చెప్పడంతో కోనేరు చిన్ని తన దారి తాను చూసుకున్నారని తెలుస్తోంది.ఈ క్రమంలోనే భారత రాష్ట్ర సమితికి చెందిన కొంతమంది కీలక నాయకులతో సంప్రదింపులు జరిపారని, వారు ఒకే చెప్పడంతో కోనేరు చిన్ని ప్రగతి భవన్ వైపు వెళ్లారని సమాచారం. నిన్న అభ్యర్థుల ప్రకటన తర్వాత ముఖ్యమంత్రి తో సాయంత్రం కోనేరు చిన్ని భేటీ అయ్యారని తెలుస్తోంది. ఈ సందర్భంగా ఆమె ఆయనకు కేసీఆర్ నుంచి బలమైన హామీ లభించిందని భారత రాష్ట్ర సమితి వర్గాలు అంటున్నాయి. అయితే ప్రస్తుతం కొత్తగూడెం టికెట్ వనమా వెంకటేశ్వరరావుకు కేటాయించిన నేపథ్యంలో కోనేరు చిన్ని కి ఎటువంటి పదవి ఇస్తారు అనే సంశయం అందరిలోనూ ఉంది.ఈ స్థానం నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన కుంచే వెంకట రంగా కిరణ్ కు భారతీయ జనతా పార్టీ టికెట్ కన్ఫర్మ్ చేసిందని సమాచారం. బీసీ సామాజిక వర్గంలో ఈయనకు మంచి పేరు ఉండటంతో భారతీయ జనతా పార్టీ ఆయన వైపు మొగ్గు చూపిందని తెలుస్తోంది. ఇప్పటికే ఈయన ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ కొత్తగూడెం ప్రజల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. ఎటువంటి వివాదాలు లేని వ్యక్తి కావడంతో తన గెలుపు సులభం అవుతుందని రంగా కిరణ్ భావిస్తున్నారు. రంగా కిరణ్ కు టికెట్ ఇచ్చేందుకు అధిష్టానం ఒకే చెప్పిన నేపథ్యంలోనే కోనేరు చిన్ని గులాబీ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది.

## కవిత కోసం కామారెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

తనకు తన ఫ్యామిలీకి రాజకీయంగా కలిసి వస్తుందనే ఓ ఆలోచనతో కామారెడ్డి నుంచి బరిలోకి దిగేందుకు కేసీఆర్ వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు తెలుస్తోంది. అదీకాక.. దేశంలో అతిపెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్. ఈ రాష్ట్రంలో 80 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. వాటిని గంపగుత్తగా గెలుచుకొంటే.. దేశ రాజధాని హస్తిన పీఠాన్ని సునాయాసంగా కైవసం చేసుకోవచ్చునన్న విషయం అందరికి తెలిసిందే. అందుకే ప్రధాని మోదీ గతంలో సొంత రాష్ట్రం గుజరాత్‌లోని బరోడా నుంచే కాకుండా.. యూపీలోని వారణాసి నుంచి కూడా పోటీ చేసి.. రెండు చోట్ల విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన బరోడా లోక్‌సభ స్థానాన్ని వదులుకోగా.. సదరు స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపొందిన విషయం విధితమే. దాదాపుగా అటువంటి ఆలోచనే.. గులాబీ బాస్ చేస్తున్నారని.. అయితే తన సొంత జిల్లా ఉమ్మడి మెదక్ నుంచి దశాబ్దాలుగా ఎమ్మెల్యేగా గెలుస్తున్నా.. ప్రస్తుతం సదరు జిల్లాలో తనకు ఎదురుగాలి వీస్తున్నట్లు సర్వేలు రావడంతో.. ఆయన అప్రమత్తమై.. అటు గజ్వేల్ నుంచి ఇటు కామారెడ్డి నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకోవడం... ఓ వేళ రెండు చోట్లు నుంచి గెలుపొందితే.. కామారెడ్డికి కేసీఆర్ రాజీనామా చేసి.. ఆ స్థానం నుంచి తన కుమార్తె కవితను గెలుపించుకొని.. అసెంబ్లీకి తీసుకువెళ్లే అవకాశాలు మెండుగా ఉన్నాయనే ఓ చర్చ సైతం పొలిటికల్ సర్కిల్‌లో హల్‌చల్ చేస్తోంది. మరోవైపు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల తర్వాత....తెలంగాణలో రాజకీయ ముఖ చిత్రం పూర్తిగా మారిపోయింది. ఈ ఫలితాలతో తెలంగాణలో బీజేపీ కొద్దిగా డల్ అయింది. దీంతో బీజేపీ రాష్ట్ర నాయకత్వ మార్పుకు కమలం పార్టీ అగ్రనేతలు శ్రీకారం చుట్టారు. ఇంకోవైపు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీ గెలుపుతో తెలంగాణలోని ఆ పార్టీకి నయా జోష్ వచ్చినట్లు అయింది. ఆ క్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ మాత్రం.. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ముచ్చటగా మూడోసారి అధికారం అందుకోవడం కోసం.. తెలంగాణలో కారు పార్టీని షికార్ చేయించడం కోసం.. గులాబీ బాస్ కేసీఆర్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

సంపాదకీయం

# డిజిటల్ కరెన్సీ అడుగులు

డిజిటల్ రూపాయి అనేది చాలా మందికి తెలియకపోవచ్చు. పెరుగుతున్న సాంకేతికత కారణంగా ఆధునాత సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. నగదుకు బదులు డిజిటల్ కరెన్సీని వినియోగించే ట్రెండ్ దేశంలో మరింతగా పెరిగిపోతోంది. ప్రపంచంలోని ఇతర దేశాల మాదిరిగానే, మన ఇండియాలో క్రిప్టోకరెన్సీని ఉపయోగించే విధానం పెరిగిపోతోంది. అయితే నగదు కరెన్సీ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నా.. కొన్ని నష్టాలు కూడా ఉంటున్నాయి. ఎందుకంటే ఈ మధ్యకాలంలో ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోయాయి. సైబర్ నేరాలతో పాటు రకరకాల మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్తిగా దేశీయ డిజిటల్ కరెన్సీని అందుబాటులోకి తీసుకువచ్చింది. రిజర్వ్ బ్యాంక్ భారతదేశపు మొట్టమొదటి డిజిటల్ రూపాయి పైలట్ ప్రాజెక్ట్‌ను గత ఏడాదిలోనే ప్రారంభించిన విషయం తెలిసిందే. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ అని కూడా పిలువబడే డిజిటల్ రూపాయి ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభమైంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివరాల ప్రకారం.. డిజిటల్ కరెన్సీ వినియోగం వాణిజ్యంలో పెను మార్పులకు దారి తీస్తుంది. ఈ నాణేలపై ప్రభుత్వ ముద్ర ఉండడంతో ఆర్థిక మోసం, నష్టం జరిగే అవకాశం ఉండదు. ప్రస్తుతం పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలను దృష్టిలో ఉంచుకుని ఈ డిజిటల్ కరెన్సీని అందుబాటులోకి తీసుకువచ్చింది ఆర్బీఐ. డిజిటల్ రూపాయి కోసం ఇప్పటికే తొమ్మిది బ్యాంకులను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుర్తించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యెస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫాస్ట్ బ్యాంక్, హెచ్‌ఎస్‌బీసీ బ్యాంకులు ఉన్నాయి. ఈ విధానానం మరింతగా విస్తరించేందుకు ఆర్బీఐ చర్యలు చేపడుతోంది. డిజిటల్ రూపాయిని ప్రారంభించడంలో కొన్ని సాంకేతిక, విధానపరమైన సమస్యలను గుర్తించి అన్ని సమస్యలను తొలగించి ఎలాంటి అడ్డంకులు లేని విధంగా సీబీడీసీని మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దేశంలో డిజిటల్ లావాదేవీలు పెంచడంతోపాటు భౌతిక కరెన్సీ నిర్వహణకు అయ్యే ఖర్చును తగ్గించుకోవడంలో భాగంగా రిజర్వ్ బ్యాంకు డిజిటల్ కరెన్సీని అందుబాటులోకి తీసుకువచ్చింది. డిజిటల్ రూపాయి వర్చువల్ కరెన్సీ దానికి ఎటువంటి రిస్క్ లేకుండా ఉంటుంది. ప్రపంచంలో ఉన్న వర్చువల్ కరెన్సీ. ఇ-రూపాయి డబ్బు లావాదేవీ ప్రక్రియను సులభతరం చేస్తుంది. ఈ విధానం పూర్తి స్థాయిలో సక్సెస్ అయితే నోట్ల ప్రింటింగ్ విషయంలో కూడా ఖర్చు మరింతగా తగ్గే అవకాశం ఉంటుంది. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఫాస్ట్ ఎక్స్ఛేంజ్ సాధ్యమవుతుంది. ఎటువంటి అదనపు లావాదేవీ రుసుము లేకుండా అన్ని చెల్లింపులు చేసుకునే అవకాశం ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ పేర్కొంటోంది. అయితే ఈ-రూపాయిలు నిజమైన కరెన్సీకి సమానం. అందుకే కాగితం నోట్లకు బదులుగా ఈ కరెన్సీ కూడా ఉపయోగించబడుతుంది. యూపీఐ ద్వారా లావాదేవీలకు వినియోగదారుకు బ్యాంక్ అకౌంట్ అవసరం. డిజిటల్ కరెన్సీలకు ఎలాంటి బ్యాంకు అకౌంట్ అవసరం ఉండదు. అలాగే డిజిటల్ కరెన్సీలకు ఎలాంటి గడువు అనేది ఉండదు. ఈ డిజిటల్ కరెన్సీని జీవితాంతం ఉపయోగించుకోవచ్చు. మరో వైపు జర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చేపట్టిన సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) పైలట్ ప్రాజెక్టులో భాగంగా కెనరా బ్యాంక్ 'కెనరా డిజిటల్ రూపీ యాప్' పేరిట ఒక యూపీఐ ఇంటరాపబుల్ డిజిటల్ రూపీ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించింది. ప్రభుత్వ రంగ - ప్రైవేటు రంగ బ్యాంకుల్లో ఈ విధంగా డిజిటల్ కరెన్సీకి మొబైల్ యాప్ తీసుకొచ్చిన తొలి బ్యాంక్ ఇదే. ఈ యూపీఐ ఇంటరాపబులిటీ అనేది భారత ఆర్థిక వ్యవస్థను డిజిటైజేషన్ చేయడంలో ఒక విప్లవాత్మక అడుగు అని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కె. సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. వినియోగదార్లు మర్చంట్ యూపీఐ క్యూఆర్ కోడ్‌లను, కెనరా డిజిటల్ రూపీ యాప్‌తో స్కాన్ చేయొచ్చు. తద్వారా డిజిటల్ కరెన్సీలో చెల్లింపులు చేయొచ్చు. ఈ ఫీచరు ప్రస్తుత యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారానే పనిచేస్తుంది. అంటే సీబీడీసీకి విడిగా క్యూఆర్ కోడ్‌ల అవసరం ఉండదు. అనుసంధానమై ఉన్న ఖాతా నుంచి సీబీడీసీ వాలెట్‌లోకి కరెన్సీని లోడ్ చేయాలి. సీబీడీసీ వాలెట్ ఉన్న ఏ వ్యక్తికైనా డిజిటల్ కరెన్సీని బదిలీ చేయొచ్చు. సీబీడీసీ క్యూఆర్ ఆధారిత చెల్లింపులను ఎవరికైనా చేయొచ్చు. ఎవరి నుంచైనా పొందొచ్చు. వ్యాపారులకు సైతం యూపీఐ లేదా సీబీడీసీ క్యూఆర్ ఆధారిత చెల్లింపులు చేయొచ్చు. అవసరం అనుకుంటే డిజిటల్ కరెన్సీని తిరిగి అనుసంధానం చేసి ఉన్న ఖాతాకు క్రెడిట్ చేసుకోవచ్చు. అలాగే, డిజిటల్ కరెన్సీ వల్ల ఏ విధంగాను మోసపోయే అవకాశం ఉండదు. బిట్ కాయిన్ వంటి కరెన్సీలలో ఈ-రూపాయిలు ఆర్థిక ప్రమాదానికి అవకాశం లేదు. ఈ-రూపాయిల వినియోగం వల్ల ప్రభుత్వానికి కూడా చాలా డబ్బు ఆదా అవుతుంది. ఎందుకంటే కాగితపు నోట్ల విషయంలో ముద్రణ, పంపిణీ, నిల్వకు ఎటువంటి ఖర్చు ఉండదు. కాగితంపై ఆధారపడటాన్ని తగ్గించడం వల్ల పర్యావరణం కూడా ఆదా అవుతుంది.

## సచివాలయంలో నల్ల పోచమ్మ ప్రతిష్ఠాపన ప్రారంభం



హైదరాబాద్ -ప్రభాత సూర్యుడు : తెలంగాణ సచివాలయంలో మూడు రోజులపాటు శాస్త్రోక్తంగా జరుగనున్న నల్లపోచమ్మ అమ్మవారి ప్రతిష్ఠాపన మహోత్సవం వేడుకలు బుధవారం ప్రారంభం అయ్యాయి. సీఎం కేసిఆర్ ఆదేశాల మేరకు మొదటిరోజు గణపతి పూజా కార్యక్రమానికి రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దంపతులు హాజరయ్యారు.

# మహిళలను రోడ్డెక్కించడం సబబు కాదు

- ఏఎన్ఎం లను వెంటనే పర్మనెంట్ చేయాలి
- ఇద్దరు ఒకే పని...జీతాల్లో వ్యత్యాసాలు ఎందుకు...?
- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శోభారాణి మోకాల్లపై నిల్చుని ఏఎన్ఎం ల నిరసన




జగిత్యాల - ప్రభాత సూర్యుడు : గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు వైద్య సేవలను అందిస్తూ, ఆరోగ్యాలను కాపాడుతున్న కాంట్రాక్ట్ రెండవ ఏఎన్ఎం లను పర్మనెంట్ చేయకుండా హక్కుల సాధనకోసం రోడ్డెక్కింన్చడం సరికాదని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, బతికేపల్లి సర్పంచి తాటిపర్తి శోభారాణి ఆరోపించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎం లను రెగ్యులర్ చేయలనే డిమాండు తో 8 రోజులుగా జగిత్యాల ఆర్డీవో కార్యాలయం ముందు తెలంగాణ ఎఎన్ఎం ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గానీడ్ల మధురిమ ఆధ్వర్యంలో సమ్మె చేస్తుండగా బుధవారం శోభారాణి పాల్గొని ఏఎన్ఎం లతో కలిసి మోకాళ్ళపై నిల్చుని నిరసన తెలిపారు. తహషీల్ చౌరస్తాలో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మమమల్ని రెగ్యులర్ చేసి మహిళలను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 5600 మంది ఏఎన్ఎం లు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, తదితర విభాగాల ద్వారా పనిచేస్తున్నారని , రెగ్యులర్ వారితో సమానంగా విధులు నిర్వహించాడమే కాకుండావైద్య సేవలు అందిస్తున్న జీతంలో వ్యత్యాసం ఎందుకని ప్రశ్నించారు. వీరితో పాటు మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ మెల్ ను కొన్ని నెలల క్రితం పర్మనెంట్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఏఎన్ఎం లను రెగ్యులర్ చేయకుండా ఎందుకూ వివక్ష చూపుతుందని శోభారాణి మండిపడ్డారు. మహిళల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడడం తగదని, మహిళలకు అన్యాయం జరుగుతునీటే ఎమ్మెల్సీ కవిత ఈ విషయంలో చొరవ చూపకపోవడం బాధాకరమని అమే పేర్కొన్నారు. మధురిమ మాట్లాడుతు కేవలం ఒకే ఒక్క రెగ్యులర్ చేయాలని డిమాండ్ తో మేము గత కొన్ని రోజులుగా వివిధ రకాలుగా నిరసన తెలుపుతున్న ప్రభుత్వం పట్టించుకోవలేదని అవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 33జిల్లాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎం లు తీవ్ర ఆందోళన చేస్తున్నారని ప్రభుత్వం వెంటనే ఇతర శాఖల్లో చేసిన మాదిరిగానే మమ్మలని రెగ్యూలర్ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కెటిఆర్, హరీష్ రావు, ఎమ్మెల్సి కవిత లను మధురిమా కోరారు. కార్యక్రమంలో పద్మ, పి. శిరీష, మాదేశి శిరీష, నీరజ, సుప్రియ, జమున, గణిత, సుమలత, సునీత, జయప్రద, చిలకమ్మ, ఊర్మిళ, రమా, ప్రమీల, ఎలిజబెత్ తదితరులు పాల్గొనారు.

# రహదారుల విస్తరణ అభివృద్ధికి ప్రాధాన్యత

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్




ఖమ్మం - ప్రభాత సూర్యుడు : రహదారుల విస్తరణ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. బుదవారం ఖమ్మం రూ. 700 లక్షల అంచనా వ్యయంతో ఖమ్మం ఇల్లందు రోడ్డు కి.మీ. 6/9-8/2 వరకు నాలుగు లైన్లుగా అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ పనులకు రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో రఘు నాథపాలెం మండలం అర్బన్ మండలం కింద ఉండేదని, ఆ గ్రామంలో అడుగు పెడితే బురదగా ఉండేదని అన్నారు. తాను పట్టుపట్టి, అర్బన్ మండలంగా ఉన్న రఘునాథపాలెం ను క్రొత్త మండలంగా ఏర్పాటు చేసామన్నారు. గత 9 ఏళ్లలో ఈ మండలం పై ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని విధాలా అభివృద్ధి చేసినట్లు ఆయన అన్నారు. రఘునాథపాలెం మండలంలో రోడ్ల కోసం నిధులు తీసుకొని వచ్చినట్లు ఆయన తెలిపారు. తనకు వచ్చిన నిధులల్లో సింహభాగం రఘునాథపాలెం మండలంకే కేటాయించినట్లు మంత్రి అన్నారు. మండలంలో ఉన్న అనేక గ్రామాల్లో సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్, డ్రెనేజీలు నిర్మాణం చేసామన్నారు. మండలంలో అనేక గ్రామాల్లో డొంక రోడ్ల కోసం రూ. 2 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఇటీవలే మళ్ళీ రూ. 2.30 కోట్లు మంజూరు అయ్యాయని ఆయన అన్నారు. రూ. 13.60 కోట్లతో తండాలకు కనెక్టివిటీ కోసం అరు రోడ్లు మంజూరు చేశామన్నారు. గిరిజనులకు రాజ్యాధికారం కట్టబెట్టేందుకు అనేక మండలంలో అనేక తాండలను గ్రామ పంచాయతీ లుగా ఏర్పాటు చేసామన్నారు. కొత్త మండలం ఐనా సరే అభివృద్ధిలో ముందు ఉండాలని తహసీల్దార్, పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి, నూతన భవనాలు నిర్మించినట్లు ఆయన తెలిపారు. ఇప్పుడు ఈ రోడ్డు విస్తరణతో రఘునాథపాలెం ఇంకా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. మండల అభివృద్ధితో రైతులు కోటీశ్వరులు అయ్యారని మంత్రి తెలిపారు. కార్పొరేషన్ ఉన్న హంగులు అన్ని రఘునాథపాలెం మండలంలో ఉండే విధంగా పనులు చేసినట్లు ఆయన అన్నారు. రైతు రుణాలు మాఫీ చేసినట్లు, రైతులకు రూ. 75 వేల కోట్ల రైతుబంధు ఇచ్చి పెట్టుబడి సహాయం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని ఆయన తెలిపారు. గృహలక్ష్మీ కింద పేదలకు ఇంటి స్థలం ఉంటే రూ. 3 లక్షలు ఇస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్ అండ్ బి ఎస్ఇ లక్ష్మణ్, పీఆర్ ఇఇ కెవికె. శ్రీనివాస్, రఘునాథపాలెం ఎంపిపి గౌరీ, జెడ్పిటిసి ప్రియాంక అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యనగరానికి దూరం కానున్న ఐటీ

(మొదటిపేజీ తరువాయి)

కోట్లు పలుకుతోంది. ఇప్పటివరకు పలిగిన గరిష్ఠ ధర రూ. 60 కోట్లు మాత్ర మే. ముంబాయిలోని పన్వెల్-ఐరోలీ ఐటీ కారిడార్‌లో కూడా ఎకరా రూ. 25-30 కోట్లు మాత్రమే పలుకుతోంది. నోయిడాలో ఎకరా రూ. 45 కోట్లు పలికింది. పూణె లోని హింజెవాడి, ఖరాడీ ప్రాంతాల్లో రూ. 18-30 కోట్ల ధర పలికింది. హైదరాబాద్ కోకాపేట మాత్రం వంద కోట్ల రికార్డు సెట్ చేసింది. ఇక్కడ గతేడాది జూలైలో వేలంలో సగటున ఎకరా రూ. 40 కోట్లు పలికింది. తాజా వేలంలో సగటు రూ. 73.23 కోట్లకు చేరింది. ఏడాదికాలంలోనే రెట్టింపు కావడం వెనుక రియల్ ఎస్టేట్ సంస్థల హస్తం ఉందనే ఆరోపణలున్నాయి. హైదరాబాద్‌కు అన్ని వైపులా అడ్డూ అదుపూ లేకుండా విస్తరించేందుకు అవకాశం ఉంది. చుట్టూ అవుటర్ రింగ్ రోడ్డు ఉంది. ఆ పైన రీజనల్ రింగ్ రోడ్డు వస్తోంది. అంటే, అందరికీ ఇళ్లు అందుబాటులోకి తేవాలనే సదుద్దేశం ప్రభుత్వానికి ఉంటే, రియల్ ఎస్టేట్ సంస్థలతో కలిపి ఎక్కడ డిమాండ్ అధికంగా ఉంది, ఏ ప్రాంతంలో ఏ అవసరాలున్నాయి అని సామాజిక అధ్యయనం చేసి, ప్రణాళికలు రూపొందిస్తే వచ్చే వందేళ్ల వరకు నగరం అభివృద్ధి చెందుతూ ఉండేలా చూసుకోవచ్చు. కానీ, ఆ ప్రయత్నమే జరగలేదు. దేశంలో ఏ మెట్రో నగరంలో లేని విధంగా ఫ్లోర్ స్పెస్ ఇండెక్స్ పరిమితిని ఎత్తేయడంతో దక్షిణాదిలోనే అత్యధిక ఎత్తైన భవనాలు హైదరాబాద్‌లో వస్తున్నాయి. డిమాండ్ లెక్కలు వేసు కోకుండా ఒకేచోట అన్ని భవనాలు వస్తే అమ్ముడుపోతాయా? అనే సందేహం కూడా నెలకొంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఇటీవలే ఎకరా రూ. వంద కోట్ల మార్క్ దాటింది. కోకాపేట నియోపోలిస్ వేలంలో దాదాపు అన్ని ప్లాట్లు ఎకరా రూ. 75-80 కోట్లకు అమ్ముడు పోయాయి. ఈ ప్రాంతంలోనే ఒకేసారి భూముల ధరలు డబులై పోయాయి. ఈ వార్త ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు? దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలోనూ, ప్రపంచవ్యాప్తంగా భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లలోనూ కొద్ది వారాలుగా హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర అధికార పక్షం బీఆర్ఎస్ కూడా నగరాభివృద్ధికి, భవిష్యత్తుకు దీన్ని ఒక ఇండికేటర్‌గా ప్రకటిస్తూ ఘనంగా చాటుకుంటోంది. ఇప్పుడు దేశంలోని ఐటీ కారిడార్లలోనే రియల్ ఎస్టేట్ పరంగా హైదరాబాద్ ఖరీదైన నగరంగా మారింది. అయితే, ఈ రికార్డు ధరలే ఇప్పుడు నగరానికి అత్యంత కీలకమైన ఐటీ రంగం పురోగతికి సవాలు విసురుతున్నాయి. ఇటీవలే ఐటీ ఎగుమతుల్లో దేశంలోనే అగ్రస్థానం సంపాదించుకున్న హైదరాబాద్ నగరం దాన్ని నిలబెట్టుకోవాలంటే దశాబ్దాలుగా ఇక్కడ నెలకొన్న ఐటీ అనుకూల వాతావరణం కొనసాగాలి. 1990ల్లో హైదరాబాద్‌కు ఐటీ కంపెనీలు వచ్చినపుడు వాటిని ఆకర్షించిన ప్రధాన అంశం మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసి, కారుచౌకగా ఇచ్చిన భూములు. ఆ తర్వాత నగరం వేగంగా విస్తరించినా ఇక్కడ భూముల ధరలు ఇటీవలి వరకు దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే చౌకగానే ఉన్నాయి. కానీ, తాజా పరిస్థితుల్లో పెరుగుతున్న భూముల ధరలు బహుళజాతి కంపెనీలకు కూడా దడ పుట్టిస్తున్నాయి. ఇతర నగరాల్లో ఏటా 10-20 శాతం పెరుగుతుంటే, హైదరాబాద్‌లో ఏకంగా వంద శాతం పెరిగి ఐటీ కంపెనీలకు, ఉద్యోగులకు షాక్ ఇచ్చాయి.

### అన్ని వర్గాలకు ప్రజలకు

## అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

**- 300 మంది లబ్ధిదారులకు బీసీ బందు పంపిణీ**



**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు :** బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపుతున్నారని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని శాస్త్ర గార్డెన్స్‌లో బీసీ బంధు పథకానికి ఎంపికైన 300మంది లబ్ధిదారులకు 3 కోట్ల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పంపిణి చేశారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం అబ్దుల్లాపూర్ గ్రామానికి చేదిన పేరుకు శ్రీనివాస్ కు బీసీ బందు పథకం కింద మంజూరైన లక్ష రూపాయల చెక్కులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్త కిషన్ గౌడ్, సర్పంచ్ లు చెరుకు కిరణ్ కుమార్ గౌడ్, పోచంపల్లి సుధాకర్ రెడ్డి, నాయకులు మొగుళ్ళ జీవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నల్గోండ అసెంబ్లీ టికెట్ కు

## కోమటిరెడ్డి దరఖాస్తు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

అసెంబ్లీ టిక్కెట్‌ల కోసం గాంధీ భవన్ కు ధరఖాస్తు ల వెల్లువ కొనసాగుతోంది. తాజాగా బుధవారం నాడు నల్లగొండ అసెంబ్లీ టిక్కెట్ కోసం ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధరఖాస్తు చేసారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి తరుపున గాంధీ భవన్‌లో నల్లగొండ టౌన్ ప్రెసిడెంట్ గుమ్మల మోహన్ రెడ్డి దరఖాస్తు చేసారు. అయన వెంట నల్లగొండ జెడ్పీటీసీ లక్ష్మయ్య ,మాడుగల్ పల్లి జెడ్పీటీసీ సైదులు, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు వున్నారు. పాల్గొన్నారు వ్యక్తిగత ,రాజకీయ పూర్తి వివరాలతో ధరఖాస్తు పూర్తి చేసారు .

## బీజేపీ కూన శ్రీశైలం గౌడ్ అరెస్టు

**సైబరాబాద్ - ప్రభాత సూర్యుడు :** సీఎం కేసీఆర్ మెదక్ పర్యటన నేపథ్యంలో జీడిమెట్ల షాపూర్ నాగర్ చౌరస్తా లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. జీడిమెట్ల సూపర్ మాక్స్ కార్మికుల సమస్యల పై మాట్లాడేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలం గౌడ్ ను జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## ఉపాధ్యాయుడి దారుణ హత్య



**ఖమ్మం -ప్రభాత సూర్యుడు :** కూసుమంచి మండలం నాయకన్ గూడెం శివారులో హత్య జరిగింది. నాయకన్ గ్రామానికి చెందిన వెంకటాచారి అనే ఉపాధ్యాయుడిని గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి హత్య చేశారు. వెంకటాచారి నడిగూడెం మండలం రామ చంద్రపురం ప్రభుత్వ పాఠశాల లో ఉపాద్యా యుడిగా పని చేస్తున్నారు. రోజూ లాగానే పాఠ శాలకు వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు నాయకన్ గూడెం శివారు లో గొంతు కోసి హత్య చేశారు. సమాచారం తెలుసుకున్న కూసుమంచి పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించి హత్యకు గల కారణాలపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

## కోదాడ అభ్యర్థిని మార్చాలి రాజీనామాకు సిద్ధం

**నల్గోండ -ప్రభాత సూర్యుడు :** సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ బీఆరెస్ పార్టీలో అసమ్మతి నేతల సమావేశం జరిగింది. మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, నియోజకవర్గ మాజీ ఇన్చార్ శశిధర్ రెడ్డి, బీఆరెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెర్నేని వెంకటరత్నబాబు, మున్సిపల్ చైర్మన్ వనపర్తి శిరీష లక్ష్మీ నారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ పాండురంగారావు, చిలుకూరు, మోతే, అనంతగిరిల జడ్పీటీసీలు.. మోతే, చిలుకూరు ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు హాజ రయ్యారు. అభ్యర్థిని మార్చకుంటే ముక్కుముడిగా పార్టీకి రాజీనామా చేయడానికి సిద్ధం. కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొల్లనీ మల్లయ్య ను ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. కోదాడ టికెట్ను పరిశీలించాలని ముఖ్య మంత్రిని, మంత్రి ని గతంలోనే కోరాం.-సొంత పార్టీ ప్రజ ప్రతినిధులపై కేస్ పెట్టిన చరిత్ర ఎమ్మెల్యే ది. దళిత బంధులో అవినీతిపై మొర పెట్టుకున్నా పట్టించుకునే నాధుడే లేడు. ప్రతి పనిలో కమిషన్ తీసుకొని పని చేస్తున్న ఎమ్మెల్యే. అవినీతిలో కోదాడ టాప్.. అభివృద్ధినిల్. లక్షల రూపాయలు తీసుకొని అధికారులకు పోస్టింగ్ ఇచ్చిన చరిత్ర ఎమ్మెల్యే దని వారు ఆరోపించారు.

## తుపాకీ మిస్ ఫైర్ ..హెడ్ కానిస్టేబుల్ మృతి


**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

హైదరాబాద్ పాత బస్తీలని హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు పోలీసు తుపాకీ మిస్ ఫైర్ అయింది. కబుతర్ ఖాన ప్రాంతంలో పికెట్లో విధులు ముగించుకొని పడుకునే క్రమంలో భూపతి విక్రమ్ అనే హెడ్ కానిస్టేబుల్ తన చేతిలోని తుపాకీ మిస్ ఫైర్ అయింది. దాంతో శ్రీకాంత్ కు తీవ్ర గాయాలయ్యాయి. తోటి పోలీసులు క్షతగాత్రడిని వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. అంతకుముందు ఘటనా స్థలాన్ని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య పరిశీలించారు..

## అభివృద్ధి, సంక్షేమాలకు ఆకర్షితులై బిఆర్ఎస్‌లో చేరికలు

**- బీసీ కులాలకు చెందిన 200 మంది చేరికలు**
**- 10 లక్షల రూపాయలతో శ్రీ విశ్వకర్మ సంఘం భవన శంకుస్థాపన**





**తుర్కయంజాల్ - ప్రభాత సూర్యుడు :** బిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీసీ కులాలకు చెందిన మహిళలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు భారీగా బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఇబ్రహీ ంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణపల్లిలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో మహిళలకు పెద్దపీట వేస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులను , కార్యకర్తలను మరియు విశ్వబ్రాహ్మణ కులాలకు చెందిన వంద మందికి పైగా మహిళలను వారి కుటుంబ సభ్యులను శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో విశ్వకర్మ సంఘం భవనానికి 10 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొత్త కురుమ సత్తయ్య, గుండ్లపల్లి ధనరాజ్, స్థానిక ప్రజా ప్రతినిధులు , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధి ప్రధాన ధ్యేయం

**- అభివృద్ధి బాటలో 21వ వార్డు**
**-కౌన్సిలర్ ఓరుగంటి సుజాత కిషన్ గౌడ్**





- సిసి రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్‌లు

**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు :** వార్డుల్లోని కాలనీ అన్నింటిని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్లడమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని 21వ వార్డు కౌన్సిలర్ ఓరుగంటి సుజాత కిషన్ గౌడ్ అన్నారు. బుధవారం పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు 21వ వార్డులో 60 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి, వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ్ శేఖర్ రెడ్డిలు హాజరై స్థానిక కౌన్సిలర్ ఓరుగంటి సుజాత కిషన్ గౌడ్ తో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంచలంచలుగా కాలనీలాన్నిటిని అన్ని రకాల మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జోర్క గీతా శ్రీరాములు, నాయకులు ఓరుగంటి కొండల్ గౌడ్, అధికారులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు

**- అసాంఘిక చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న యువతే లక్ష్యంగా ఆపరేషన్ చబుత్రా**
**- జిల్లా వ్యాప్తంగా పట్టుబడ్డ 108 మంది యువకులు ,56 టు వీలర్స్, రెండు కార్లు సీజ్**



**జగిత్యాల - ప్రభాత సూర్యుడు :** శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ,అర్ధరాత్రి రోడ్లపై అనవసరంగా తిరుగుతూ,అసాంఘిక చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న యువతే లక్ష్యంగా ఆపరేషన్ చబుత్రా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు అర్ధరాత్రి రోడ్లపై అనవసరంగా తిరుగుతూ, రోడ్లపై మద్యం సేవించే,అసాంఘిక చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న యువతే లక్ష్యంగా ఆపరేషన్ చబుత్రా పేరుతో జిల్లా వ్యాప్తంగా కోరుట్ల, మెట్ పల్లి ,ధర్మపురి డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. యవకులు అర్ధరాత్రి వేళల్లో ప్రధాన కూడళ్లు, వీధులు, రోడ్లు, ఫుట్‌పాత్‌లపై గుంపులుగా జులాయిగా తిరుగుతూ ప్రజలను ఇబ్బంది లకు గురిచేస్తూ, మద్యం సేవించి రోడ్లపై ద్విచక్ర వాహనాలతో రాష్ డ్రైవింగ్, హారన్లు కొడుతూ, ప్రధాన కూడళ్ల లలో వాహనాలను నిలిపి గుంపులుగా, అనుమానస్పదంగా తిరుగుతున్న 108 మంది యువకులను అదుపులోకి తీసుకోని 56 బైక్స్ ,3 కార్లను లను పోలీసులు సీజ్ చేశారు..ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని, ముఖ్యంగా యువకులు తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. అంతేకాకుండా యువత చెడు వ్యసనాలకు అలవాటు పడే అవకాశం ఉన్నదని, తల్లి దండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాల న్నారు. ఇకనుండి జిల్లాలో తరచుగా ఆపరేషన్ చబుత్రా స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించడం జరుగుతుంది అని అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఎవరైనా యువకులు రోడ్లపై అనవసరంగా గుంపులుగా సంచరిస్తూ సామాన్య ప్రజానీకానికి మరియు మహిళల ను ఇబ్బందుల కు, అభద్రత భావానికి గురి చేస్తే వారిపై టౌన్ న్యూసెన్స్ ఆక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. యువత చట్టవ్యతిరేకమైన పనుల్లో పాల్గొంటే వారి మంచి భవిష్యత్ ను కోల్పోతారని సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి, కోరుట్ల, మెట్ పల్లి, ధర్మపురి సీఐలు ప్రవీణ్ కుమార్, లక్ష్మీనారాయణ, రమణమూర్తి, ఎస్సైలు ఈ.కిరణ్ కుమార్, శ్యామ్ రాజ్ , దత్తాద్రిపోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా జేడీ లక్ష్మీనారాయణ

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో జనసేన పార్టీ నుంచి పోటీ చేశారు. అయితే సానుకూల ఫలితం రాలేదు. తర్వాత విశాఖ కేంద్రంగానే రాజకీయాలు చేస్తున్నారు. పవన్ కల్యాణ్ మళ్లీ సినిమాలు చేస్తున్నారన్న కారణంగా జనసేన పార్టీకి గుడ్ బై చెప్పారు. ఇటీవల పవన్ విషయంలో సానుకూలంగా ఉన్నప్పటికీ జనసేన పార్టీలో చేరలేదు. ఇప్పటి వరకూ జేడీ లక్ష్మీనారాయణ చాలా పార్టీల్లో చేరుతారన్న ప్రచారం జరిగింది. మొన్నటి వరకూ విశాఖ నుంచి పోటీ చేస్తానని ఏ పార్టీ నుంచి అన్నది మాత్రం తర్వాత చెబుతానని అంటున్నారు. ఏ పార్టీలో కుదరకపోతే ఇండిపెండెంట్ గా అయినా పోటీ చేస్తానని అంటున్నారు. విశాఖలో స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై న్యాయపోరాటం కూడా చేస్తున్నారు. రెండు వేల నోట్లను ఆర్బీఐ ఉపసంహరించినప్పుడు .. చంద్రబాబు చేసిన సూచనలు అమలు చేయాలన్న చేసిన ప్రకటన వైరల్ అయింది. అప్పుడు టీడీపీలో చేరుతారా అన్న చర్చ ప్రారంభణయింది. ఆ తర్వాత ఇంతకు ముందే చుక్కల భూముల విషయంలో సీఎం జగన్ గొప్ప నిర్ణయం తీసుకున్నారని జగన్ నూ ప్రశంసించారు. అప్పుడు కూడా ఇదే చర్చ జరిగింది. వైసీపీలో చేరుతారా అన్న అభిప్రాయాలు వినిపించాయి. బీఆర్ఎస్ లో చేరే విషయంలో చర్చలు జరిగాయని అప్పటికే ప్రచారం జరగడంతో ఇక బీఆర్ఎస్ లో చేరడం లాంఛనమే అనుకున్నారు. కానీ అన్ని పార్టీలనూ లక్ష్మీనారాయణ పొగుడుతున్నారు కానీ..ఎవర్నీ విమర్శించడం లేదు. పవన్ కల్యాణ్ సినిమాలు చేయనని చెప్పారని.. పార్టీని వదిలేసి సినిమాలు చేస్తున్నందున తాను జనసేనకు రాజీనామా చేశానని గతంలో ప్రకటించారు . చివరికి ఏ పార్టీలో చేరకుండా ఇండిపెండెంట్ గా పోటీ చేయాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. నిజానికి జేడీ లక్ష్మీనారాయణ పార్టీలో చేరడానికి ఆసక్తి చూపిస్తే టీడీపీ, జనసేన, బీజేపీ తో పాటు వైసీపీ కూడా రెడీగానే ఉంటుంది. అయితే వైసీపీలో ఆయన చేరలేరు. టీడీపీలో చేరితే విశాఖ టిక్కెట్ ఇవ్వరు. వేరే ఎక్కడైనా సర్దుబాటు చేస్తారు. కానీ విశాఖ నుంచే పోటీ చేస్తానని ఆయనంటున్నారు. జనసేన పార్టీకి రాజీనామా చేసినందున.. మళ్లీ జనసేన పార్టీ నేతలు ఆయనను ఆహ్వానించడం లేదు.. జేడీనే తాను చేరుతానని వెళ్లలేకపోతున్నారు. ఇక బీజేపీలో చేరేందుకు జేడీ ఆసక్తిగా లేరు. ఎన్నికలకు ముందు ఏమైనా పరిణామాలు జరిగి ఏదో ఓ పార్టీ టిక్కెట్ ఇస్తే సరి లేకపోతే..ఆయన స్వతంత్రంగానే పోటీ చేస్తారని భావిస్తున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215